
సాక్షి ఒడిశా

బుధవారం । 18 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,62,301లు, బంగారం 50 గ్రాములు, వచ్చాయని అధికారులు తెలిపారు.



30 జిల్లాలకు అతిసారం

అతిసారం వ్యాపిస్తోంది. 30 జిల్లాలో హై అలర్ట్ ప్రకటించారు.

- 8లో



జగన్నాథునికి లేహ్యం సేవ

జగన్నాథునికి లేహ్యం సేవ ఆచారం జరిగింది. మూలికలు వినియోగించారు.

- 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సీఏఓ కుమార్ పాఢి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని వార్షిక రథయాత్రకు విచ్చేయాలని కోరుతూ శ్రీమందిరం ముఖ్య నిర్వాహకుడు (సీఏవో) డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా స్థానిక రాజ్‌భవన్‌లో కలిసి గవర్నర్‌కు ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేశారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



పరిహారం అందజేస్తున్న అధికారులు

కొరాపుట్: రిజర్వాయర్ మృతులకు పరిహారాలు ప్రభుత్వం అందజేసింది. మంగళవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి భానురు గ్రామానికి వెళ్లి రూ.10 లక్షల చొప్పున బాధిత కుటుంబాలకు అందజేశారు. జోలాపుట్ రిజర్వాయర్ దలైపుట్ ఘాట్ వద్ద పుష్ప బైరాగి (15), దేవేంద్ర కిర్సాని (17)లు ప్రమాదవాశాత్తు ఆదివారం మునిగి చనిపోయారు. దీంతో వీరి కుటుంబాలకు రెడ్‌క్రాస్ ఆర్థిక సాయం చేసింది. కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ ఆదేశాల మేరకు నందపూర్ తహసీల్ ఇన్‌స్పెక్టర్లు సోమనాథ్ ముదలి, పార్వతి పర్జాలు ఆర్థిక సాయం అందించారు.

గంజాయి స్వాధీనం




గంజాయితో పట్టుబడిన మనోజ్

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంలో గంజాయితో ఒక యువకుడు అబ్కారీ శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. నిందితుడు సంబల్‌పూర్ జిల్లాకు చెందిన మనోజ్ మాఝిగా గుర్తించారు. అతడి వద్దనుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు తరలించారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అబ్కారీ శాఖ ఐఐసీ బిజయ్ కుమార్ బెక్, ఏఎస్ఐ మనిక్ చంద్ర గౌడో, ఆర్పీఎఫ్ పోలీస్ సరోజ్ కుమార్ బారిక్‌లు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫారం నంబర్ ఒకటిలో అనుమానాస్పదంగా కనిపించిన మనోజ్‌కు సంబంధించిన బ్యాగులు తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది.

200 సీట్లకు 1009 దరఖాస్తులు

- జయపురం కేంద్రీయ విద్యాలయంలో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి



జయపురంలోని కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాలు

జయపురం: జయపురంలో కొత్తగా ఏర్పాటైన కేంద్రీయ విద్యాలయంలో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 200 సీట్లను కేటాయించగా.. 1009 మంది దరఖాస్తు చేసుకున్నారని విద్యాలయం ప్రిన్సిపాల్ హరిహర పండ వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భవనంలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయాన్ని నిర్వహిస్తారు. ఈ నెల రెండు నుంచి 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు సంబంధిత అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ ఏడాది ఒకటి ఐదవ తరగతి వరకు పాఠ్య బోధన ప్రారంభిస్తారు. ఒక్కో తరగతిలో 40 చొప్పున ఐదు తరగతులకు 200 సీట్లు కేటాయించారు. అయితే ఒకటో తరగతి కోసం 261 మంది, రెండో తరగతి కోసం 223, మూడో తరగతికి 216, నాలుగో తరగతికి 129, ఐదో తరగతికి 180 మంది దరఖాస్తులు పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు ఫారాలను కొరాపుట్ జిల్లా కలెక్టర్, జయపురం సబ్‌కలెక్టర్లకు సమర్పిస్తామన్నారు. ఈ నెల 22, 23 తేదీలలో సీట్లను కేటాయించి విద్యాలయంలో విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. జూలై ఒకటవ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.



అలంకార చెక్క తోరణాలు



తయారీ తుది దశలో రథం

వస్తున్నాయ్ జగన్నాథ రథచక్రాల్

భువనేశ్వర్: ఈ ఏడాది జరగనున్న పూరీ జగన్నాథుని రథ యాత్రకు కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉంది. యాత్ర సమీపిస్తుండటంతో, జగన్నాథుని రథాల నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోంది. పూరిలోని రథ ఖాలా వద్ద శ్రీ జగన్నాథుని రథం నందిఘోష్, బలభద్రుని తాళ ధ్వజం, దేవీ సుభద్ర దర్ప దళనం అనే 3 రథాలు శ్రీ మందిరం శిఖరంతో సరిసమానంగా ఎదుగుతున్నట్లు అబ్బురపరుస్తున్నాయి. శ్రీ జగన్నాథ స్వామి యాత్ర తయారీ కార్మిక విభజనకు నిలువెత్తు తార్కాణం. అట్టడుగు నుంచి నిలువెత్తు వరకు రథాల తయారీ పనులు గొలుసు కట్టుగా కొనసాగుతున్నాయి. రథాల తయారీ శాలలో వడ్రంగులు, చేతి వృత్తులవారు, ముఖ్యంగా మహరణ, భోయి సేవకులు సంప్రదాయ గడువు ప్రకారం కట్టుదిట్టమైన ఆచార వ్యవహారాలతో ఈ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. 3 రథాల పనులు ఒకే క్రమంలో నిబద్ధతతో నిర్వహించడంతో ఒకే స్థాయిలో అంచెలంచెలుగా తయారీ పూర్తవుతుంది.

ఒక్కో రథం బహుళ అంతస్తు భవనాన్ని పోలి ఉంటుంది. రథంపై భగవంతుని పీఠం పైభాగాన 3 మిద్దెలతో రథాల తయారీ నింగిని తాకే ఊపుతో ఎదుగుతుంది. ప్రతి రథం యొక్క మూడవ మరియు చివరి మిద్దె (ఒఘా భూయి) తయారీ పూర్తయ్యింది.



శ్రీ మందిరం శిఖరం ఎత్తుని పోలిన రథాలు



రథంపై నిలిచిన మిద్దెలు

భద్రతకు ప్రాధాన్యత

సంప్రదాయబద్ధంగా వడ్రంగుల చేతిలో తయారు అవుతున్న 3 భారీ రథాల్లో ప్రతి అంశాన్ని అత్యంత కీలకంగా పరిగణిస్తున్నారు. శ్రీ మందిరం సింహ ద్వారం నుంచి గుండిచా మందిరం వరకు పోకరాకలు చేయాల్సిన రథాలకు చక్రాలకు మూలాధారం. వీటి పటిష్టతకు భద్రత కల్పించే దిశలో చక్ర రక్షకులు (పారాబొఢి) తయారీ పనులు పూర్తి కావస్తున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న దైవిక ప్రయాణానికి రథాల తయారీ సింహ భాగం పూర్తయ్యింది.

నేల నుంచి నింగికి

జగతి నాథుడు యాత్ర చేసే రథం నేల నుంచి నింగికి ఎగసినట్లు తయారవతుంది. చక్రాల నుంచి రథ శిఖరం వరకు అందం కనులు మిరమిట్లు గొలుపుతుంది. ఈ అందాన్ని ఆవిష్కరించడంలో క్లిష్టమైన కళాత్మక రంగుల మేళవింపుతో అలంకరించడంలో చిత్రకారులు హుషారుగా పని చేస్తున్నారు. రథం పార్శ్వ తోరణాల్ని (పట్టా గుజా) సేవకులు సాంప్రదాయ మూలాంశాలను రూపకారులు చెక్కుతున్నారు.

నలు వైపులా అలంకృత చెక్కలు

రథం అందాల్ని ప్రతిబింబించడంలో నలు వైపుల ఆకర్షణీయమైన అలంకార చెక్క తోరణాల (ఫాటొలా) అమరిక కీలకమైన నైపుణ్యత. రథాలపై నిలిపిన మిద్దెలు పట్టు కోల్పోకుండా దిట్టంగా ఉండేందుకు అంతర్భాగంలో వంపు తిరిగిన చెక్కల్ని (సేని) ఆధారంగా జోడిస్తున్నారు.



గట్టి పట్టు కోసం రథాల మిద్దె అంతర్భాగంలో అమర్చిన సేని



రథ చక్రాల్ని రంగరిస్తున్న చిత్రకారులు



రథ స్తంభాల అలంకరణలు



సిద్ధమవుతున్న రథాలు

రైతు సాధికారతే లక్ష్యం: సీఎం



కృషక్ శక్తి సమావేశంలో ముఖ్యమంత్రికి నాగలి బహూకరణ



పశ్చిమ ఒడిశా రైతాంగానికి ముఖ్యమంత్రి అభివాదం

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పాలన ఏడాది పూర్తి సందర్భంగా పలు ప్రాంతల్లో విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమ ఒడిశా బొలంగీరు జిల్లాలో మంగళవారం నిర్వహించిన కృషక్ శక్తి సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సుదీర్ఘంగా ప్రసంగించారు. అధునాతన సాంకేతిక, ఆర్థిక, మౌలిక సదుపాయాల మద్దతు ద్వారా రైతులను శక్తివంతం చేయడానికి ప్రభుత్వం నిబద్ధతను ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. రాష్ట్ర రైతాంగం సంక్షేమానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్ని క్రమం తప్పకుండా వాస్తవ కార్యాచరణలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీ అన్నం అభియాన్ కింద ప్రభుత్వం సంప్రదాయ వంగడాలను పునరుజ్జీవింపజేసి పౌష్టికాహార సాగుని ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ చొరవలో భాగంగా, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు తృణ ధాన్యాల లడ్డూలను పంపిణీ చేస్తామన్నారు. పశ్చిమ ఒడిశాలో వ్యవసాయ విద్య, శిక్షణను ప్రోత్సహించడానికి బలంగీర్‌లో వ్యవసాయ కళాశాల, సోన్‌పూర్‌లో మత్స్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

2047 నాటికి వికసిత భారత్ జాతీయ లక్ష్యం బాటలో రాష్ట్రావతరణ శత జయంతి 2036 నాటికి సుసంపన్న ఒడిశా ఆవిష్కరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యాచరణలో వ్యవసాయం, రైతు అభివృద్ధి సాధించడం కీలకమైన అంశాలుగా పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ వ్యవసాయం ప్రాధాన్యతతో రైతు సోదరసోదరీమణుల ఆర్థిక సాధికారత బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతులకు అన్ని రకాల సాంకేతిక సహాయాన్ని అందుబాటులోకి తెచ్చి ఈ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ రైతు సంక్షేమ చర్యలు రైతుల ఆదాయాన్ని పెంపొందించడంతో రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు.



కృషక్ శక్తి సమావేశానికి హాజరైన జనం

ఈ సభలో ముఖ్యమంత్రి వ్యవసాయ రంగంలో సాఫల్యత సాధించిన రైతులను సత్కరించి అభినందించారు. వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడానికి రైతాంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను పెంచడం రైతు సాధికారితపై ప్రభుత్వం నిబద్ధత స్పష్టం అవుతుందని ఈ సభలో ప్రసంగించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ తెలిపారు. ఒడిశా ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లకు పండ్లను ఎగుమతి చేస్తోంది. రైతు సాధికారత కోసం ప్రభుత్వం సంకల్పించిన పథకాలు, కార్యక్రమాల సాఫల్యతకు ఇది నిదర్శనంగా ఆయన కొనియాడారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముకేష్ మహాలింగ్ ప్రజారోగ్యం కోసం స్థానిక ఉత్పత్తుల ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తిస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి వ్యవసాయ రంగం బలోపేతం తొలి మెట్టుగా రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగు నీరు విభాగం మంత్రి రబీ నారాయణ్ నాయక్ ప్రసంగించారు. కార్యక్రమానికి బొలంగీర్ లోక్ సభ సభ్యురాలు సంగీత కుమారి సింగ్ దేవ్, కలెక్టర్ గౌరవ్ శివాజీ ఇసల్వార్, బర్‌గఢ్ లోక్ సభ సభ్యుడు ప్రదీప్ పురోహిత్, టిట్లాగడ్ నియోజక వర్గం ఎమ్మెల్యే నబీన్ కుమార్ జైన్, కంటాబంజి నియోజక వర్గం ఎమ్మెల్యే లక్ష్మణ్ బాగ్, ఉత్తర ప్రాంత రెవెన్యూ కమిషనర్ సచిన్ రామచంద్ర యాదవ్ తదితరులు హాజరయ్యారు.

స్థానిక సంస్థలకు సాధికారత యోచన

- ముఖ్యమంత్రితో రాష్ట్ర ఆర్థిక సంఘం సంప్రదింపులు



ముఖ్యమంత్రితో ఆరో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల సమావేశం

భువనేశ్వర్: ఆరో రాష్ట్ర ఆర్థిక సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు సాధికారత కల్పించే దిశలో ఆయన సూచనలను కోరింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒడిశా రాష్ట్ర ఆర్థిక కమిషన్ వెబ్‌సైట్ (httpr://rfc.odirha.gov.in) ను ప్రారంభించారు. ఎన్నికైన ప్రతినిధులు, గ్రామ పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లు, మేధావులు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, పౌర సమాజ సంస్థలు, వ్యక్తుల నుంచి సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానించడానికి ఈ వెబ్‌సైట్ అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఈ వెబ్‌సైట్‌లో మునుపటి, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక కమిషన్ల వివరాలు, అధ్యయన నివేదికలు మొదలైనవి పొందుపరిచారు. వీటిని ప్రజల సాధారణ సమాచారం కోసం పొందుపరిచినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

ప్రభుత్వం డాక్టర్ అరుణ్ కుమార్ పాండా అధ్యక్షతన 6వ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసింది. 6వ రాష్ట్ర ఆర్థిక కమిషన్ చైర్మన్ డాక్టర్ అరుణ్ కుమార్ పండా, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాశ్వత మిశ్రా, ఎలక్ట్రానిక్స్ – సాంకేతిక సమాచార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విశాల్ కుమార్ దేవ్, 6వ రాష్ట్ర ఆర్థిక కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ అసిత్ రంజన్ మహంతి, ప్రొఫెసర్ అమరేష్ సామంత్రాయ్ మరియు డాక్టర్ బిభు ప్రసాద్ నాయక్, కమిషన్ సభ్య కార్యదర్శి డాక్టర్ సత్య ప్రియ రథ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1, 2026) నుంచి ఆరంభం కానున్న పంచ వర్ష ప్రణాళిక నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్థానిక సంస్థలకు (గ్రామ పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లు) వనరుల బదిలీని కమిషన్ ప్రతిపాదించింది.

వైద్యుడిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు



ఐఐసీకి ఫిర్యాదు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యుడిపై దాడి జరిగింది. దాడికి గురైన వైద్యుడు సోపన్‌కుమార్ డిండా తెలిపిన వివరాల మేరకు.. బాలిక ఊయల ఊగుతూ పడిపోయిందని తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకుని వచ్చారని, ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో సిబ్బంది క్యాజువాలిటీలో చేర్చుకున్నారని, తాను ఆ సమయంలో 4వ అంతస్తులో ఉన్నానని, కిందకు వచ్చి చూస్తే బాలిక తల నుంచి రక్త స్రావం అవుతున్నట్లు గమనించానని చెప్పారు. వారికి చెబుతుండగానే బయట ఊరికి తీసుకుపోతామని చెప్పారని, ఓ ప్రైవేటు వాహనంలో తిరిగి 6.30కు ఇక్కడకు తెచ్చారని, బాలికకు చికిత్స చేస్తుండగా 7.15కు మృతి చెందిందని తెలిపారు. దీనిపై బాలిక తండ్రికి వివరిస్తుండగా ఆయన స్నేహితులు దాడికి దిగారని తెలిపారు. మంగళవారం మళ్లీ ఆస్పత్రికి మీదకు వచ్చారని పోలీసులను ఆశ్రయించారు. మల్కన్‌గిరి ఐఐసి రీగాన్ కీండో కేసు నమోదు చేశారు.

లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజీలో మరోసారి ఉద్రిక్తత



కొరాపుట్ ఎస్ఎల్ఎన్ వైద్య కళాశాలలో ఆందోళన కారులను సముదాయిస్తున్న పోలీసులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ కళాశాలలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం కళాశాలలో దశమంత్‌పూర్ సమితి మాలి మండాగుడ గ్రామానికి చెందిన ధను హంతాల్ (35) కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరాడు. అతనడికి కడుపులో నీరు తీయాలని వైద్యులు చెప్పారు. మూడు రోజులైనా నీరు తీయలేదు. దీంతో మధ్యాహ్నం ఆ వ్యక్తి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజుల క్రితం వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఆరుగురు రోగులు చనిపోయారనే వివాదం ఇంకా కొనసాగుతోంది. మరోసారి మరో మృతి చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రోగి బంధువులు ఆందోళనకు దిగారు. వెంటనే పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వార్డుల తలుపులు మూసివేసి వారికి నచ్చజెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుని బంధువులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు మద్దతుగా నిలిచారు.

జలాశయాల్లో మృత్యు ఘోష

- మూడు రోజుల్లో ఐదుగురు బలి
- ఇంకా లభ్యం కాని బెంగళూరు ఇంజినీర్ ఆచూకీ



గులిమి జలపాతంలో గల్లంతైన కిరణ్ మిర్గాన్, అలోక్ రాజ సునా



గులిమిలో బాలురు కోసం గాలిస్తున్న అగ్నిమాపక బృందాలు



మాచ్‌ఖండ్ డుడుమాలో ఇంకా ఆచూకీ లేని బెంగళూరు ఇంజినీర్ అన్వేస్ దాస్

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో జలాశయాలు కోరలు చాస్తున్నాయి. వరుసగా మూడు రోజుల్లో మూడు వేర్వేరు ప్రాంతాలలో ఐదుగురు బలయ్యారు. కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ సమితి ముర్తా హండి గ్రామ పంచాయతీలో ప్రఖ్యాత గులిమి జల పాతంలో ఇద్దరు బాలలు గల్లంతయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్మడ సమితికి చెందిన కిరణ్ మిర్గాన్ (16), అలోక్ రాజ సునా (16)లు మరో ఆరుగురు మిత్రులతో కలసి గులిమి వెళ్లారు. అక్కడ రీల్స్ తీస్తూ జలపాతంలో కొట్టుకుపోయారు. ఇది గమనించిన మిగతా మిత్రులు పెద్దలకు సమాచారం ఇచ్చారు. వెంటనే కొట్‌పాడ్ నుంచి అగ్ని మాపక,ఒడ్రాఫ్ దళాలు వెళ్లి జలాశయం లో గాలింపు చర్యలు చేపట్టాయి. కానీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. మరో వైపు ఇదే జిల్లా లమ్తాపుట్ సమితి మాచ్‌ఖండ్ డుడుమా జల పాతం వద్ద గల్లంతైన బెంగళూరు యువ ఇంజినీర్ అన్వేస్ దాస్ (27) గల్లంతై మూడు రోజులు గడుస్తున్నప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం నందపూర్ సమితి జోలాపుట్ డ్యామ్‌లో ఇద్దరు మైనర్లు ప్రమాదవశత్తు పడి మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఈ మూడు ప్రమాదాల బారిన పడ్డవారందరూ ఆ ప్రాంతం లో నీటి అంచనా తెలియక బలైన వారే కావడం విశేషం.

నగరంలో ప్రభుత్వ అతిథి భవనం

భువనేశ్వర్: వివిధ ప్రయోజనాల కోసం రాజధాని నగరాన్ని సందర్శించే ప్రజలకు వసతి కల్పించేందుకు భువనేశ్వర్‌లో అతిథి భవనం నిర్మాణ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ప్రతిపాదిత అతిథి గృహ నిర్మాణానికి సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని నగరం నడిబొడ్డున ఉన్న అశోక్ నగర్ ప్రాంతంలోని యూనిట్ 2 వద్ద సుమారు 3 ఎకరాల విస్తీర్ణపు స్థలంలో అతిథి భవనం ఏర్పాటు చేయనున్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని యూనిట్ 2లో అతిథి భవన్ నిర్మాణ ప్రతిపాదనను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, అధికారిక, ప్రభుత్వ, ఆరోగ్య సంరక్షణ సంబంధిత అవసరాతు తదితర కార్యకలాపాల కోసం వివిధ జిల్లాల నుంచి రాజధాని నగరానికి వచ్చేసే వారికి వసతి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అతిథి భవన సముదాయం నిర్మాణానికి ఆమోదించడం విశేషం. వివిధ ప్రయోజనాల కోసం నగరాన్ని సందర్శించే ప్రజలకు సరసమైన వసతి సౌకర్యాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వర్‌లో 30 అతిథి గృహాలను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి ఇటీవల ప్రకటించారు. ఆయన సమాచారం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 30 జిల్లాల ప్రజలకు ప్రత్యేక అతిథి గృహాలను ఏర్పాటు చేస్తుంది. ఒక్కో జిల్లా అతిథి భవన సముదాయంలో రాజధాని నగరాన్ని సందర్శించే ప్రజల కోసం 100 గదులను కలిగి ఉంటుందని మంత్రి సమాచారం.

క్లుప్తంగా

ఆకర్షించిన సైకత మొసళ్లు



రాష్ట్రంలో మొసళ్ల సంతతి సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు క్రోకోడైల్ ఇన్ ఒడిశా కార్యక్రమం చేపట్టి మంగళవారం నాటికి 50 ఏళ్లు పూర్తయింది. మరో వైపు ప్రపంచ మొసళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పూరీ సాగర తీరంలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత మొసళ్లు పర్యాటకులను విశేషంగా ఆకర్షించాయి. –భువనేశ్వర్/పూరీ

స్వచ్ఛంద రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాత

జయపురం: సంబాద్–అమొ ఒడిశా ద్వారా స్థానిక అగ్రసేన్ భవనంలో మంగళవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జయపురం రక్త బండార్ అధికారి డాక్టర్ సూర్య శేఖర మిత్ర ముఖ్యఅతిథిగా శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వక్తలు రక్తదాతలకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా తొమ్మిది యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. జయపురం రక్త బండార్ టెక్నీషియన్ అజయ కుమార్ పండ, నితినియాల్ ధాని, బి.ప్రతిభ పాత్రో తదితరుల దాతల నుండి రక్తం సేకరించారు. శిబిరంలో సంబాద్ –అమొ ఒడిశా జయపురం ప్రతినిధి తరుణ కుమార్ పాత్రో, అశోక్ కుమార్ పోలాయ్లతో పాటు సమాజ సేవి అరుణ జైన్, సంజయ్ జైన్, జయపురం సబ్‌డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో, హరిప్రియ బిశాయి, మహమ్మద్ రసూల్, శైలజ హత్త, పి.ఆనంద, రాధాకాంత దాస్, వి.సత్యనారాయణ సెట్టి, పవణ దాస్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



శైలేంద్ర మహంతి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నీలాకాంబేర్ పంచాయతీకి చెందిన శైలేంద్ర మహంతి(55) అనే వ్యక్తి సోమవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. శైలేంద్ర బలిమెల డిగ్రీ కాలేజీలో ప్యూన్‌గా పని చేస్తున్నాడు. అయితే సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 8.30 గంటల సమయంలో చిన్న కొడుకు ఇంటికి వచ్చి తలుపు తీయగా తండ్రి ఉరికి వేలాడుతూ కన్పించాడు. దీంతో వెంటనే స్థానికుల సాయంతో బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాముకాటుతో యువకుడు మృతి



వీరేంద్ర కుమార్ సాబొరొ మృతదేహం

రాయగడ: పాము కాటుతో యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని గుడారి సమితి పెండిలి గ్రామ పంచాయతీ దుప్పులపాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు వీరేంద్ర కుమార్ సాబొరొ (16)గా పోలీసులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరేంద్ర కుమార్ గ్రామ సమీపంలోని పొలం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో పాముకాటు వేసింది. దీంతో కుటుంబీకులు అతనిని వెంటనే హస్పిటల్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో గల బొడొవీధిలో నివసిస్తున్న వేలధర్ కౌసల్య (15) పాము కాటుతో మృతి చెందాడు. సోమవారం రాత్రి అంతా భోజనం చేసి నిద్రిస్తున్న సమయంలో పాము వేలధర్ పొట్ట వద్ద కాటు వేసింది. పిల్లాడు నొప్పితో బాధ పడుతుండడంతో కుటుంబ సభ్యులు వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ వేలధర్ మంగళవారం మృతి చెందాడు.



వేలధర్ కౌసల్య మృతదేహం

30 జిల్లాలకు అతిసారం



రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనరు, కార్యదర్శి సమీక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో అతిసారం, కలరా వ్యాప్తి అధికార యంత్రాంగానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం 30 జిల్లాలను హై అలర్ట్ ప్రాంతాలుగా ప్రకటించింది. ముప్పును నియంత్రించడానికి నియంత్రణ చర్యలను ముమ్మరం చేసింది. జాజ్‌పూర్ జిల్లా మాత్రమే కాకుండా రాష్ట్రంలోని 30 జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాప్తిని అరికట్టడానికి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్, కార్యదర్శి ఎస్. అశ్వత్థి తెలిపారు. అతిసార, కలరా తాజా స్థితిగతుల్ని సమీక్షించేందుకు ఆమె ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు పెరుగుతున్నాయి. వీటి కట్టడికి అత్యవసర చర్య తీసుకోవడం అనివార్యంగా పేర్కొన్నారు. 5 జిల్లాల్లో గత పది రోజుల్లో 300 కి పైగా కొత్త అతిసార రోగులు నమోదయ్యారు. ఆస్పత్రిలో చేరిన రోగులను 24 గంటల పాటు పర్యవేక్షణలో ఉంచాలని జిల్లా ఆరోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కొత్త కేసుల్లో ఎక్కువ భాగం తేలికపాటివేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన ప్రచారం చేస్తున్నారు. మరో 7 రోజుల పాటు ఈ కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందన్నారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో రోజువారీ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. 14 మంది సభ్యుల కేంద్ర బృందం ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వ్యాధిని అరికట్టడానికి చర్యలను సూచిస్తోంది.



జాజ్‌పూర్ జిల్లాలో అతిసార కట్టడి ప్రచార రథం



క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ డైరెక్టర్ దీపంకర్ మహాపాత్రో అధ్యక్షతన క్రీడా వసతి గృహాల్లో సురక్షిత తాగు నీటి వ్యవస్థ సమీక్ష సమావేశం

రాష్ట్ర ఆరోగ్య అధికారులు కేంద్ర బృందంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ వ్యాప్తి ఇంకా అంటువ్యాధిగా విజృంభించలేదని పరిశీలన వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. పరిస్థితి విషమించకుండా ప్రభుత్వం ప్రభావిత ప్రాంతాలతో సహా మిగిలిన 25 జిల్లాల్లో కూడ తాగు నీటి వనరులను క్రిమిరహితం చేస్తోందని ప్రకటించారు. కలరా కేసులను గుర్తించేందుకు పరీక్షించిన నమూనాల్లో కేవలం 10 శాతం మాత్రమే కలరా సంక్రమణను నిర్ధారించాయని ఆరోగ్య శాఖ కమిషనరు, కార్యదర్శి ధ్రువీకరించారు.

ఆరోగ్య కార్యదర్శి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో కార్యకలాపాల పరిశీలన కోసం 4 రాష్ట్ర స్థాయి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ బృందాలలో సీనియర్ అధికారులు, నిపుణులు, వైద్య సిబ్బంది ఉన్నారు. తక్షణ చికిత్స, ప్రజలలో అవగాహన, సమర్థవంతమైన వ్యాధి నిర్వహణ వ్యవహారాల్లో స్థానిక ఆరోగ్య సంరక్షణ విభాగాలతో సమన్వయం పరిరక్షణ ఈ బృందాల ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ బృందాలు బొడొచొణ, భువన్, బంకి, ధర్మశాల , భండారి పొఖొరి సహా వివిధ ప్రాంతాలను సందర్శిస్తాయి.

బీఎంసీ అప్రమత్తం

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో కలరా కేసులు ఖరారు కావడంతో స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ అప్రమత్తమైంది. స్వయంప్రతిపత్తి సంస్థల ఆధ్వర్యంలో వివిధ నివారణ చర్యలు చేపడుతున్నారు. తాగునీటి వనరులను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారు, అవసరమైతే శుద్ధి చేస్తున్నారు. గొట్టపు బావులు, ఇతరేతర తాగు నీటి మాధ్యమాలు మరమ్మతులు చేస్తున్నారు. ఆహార భద్రతా అధికారులు నాణ్యతను తనిఖీ చేయడానికి వివిధ ఆహార, పానీయాల దుకాణాలను సందర్శిస్తున్నారు. దీనితో పాటు, కలరా గురించి ప్రజల్లో అవగాహన కూడా కల్పిస్తున్నారు.



నగరంలో నూతి నీరు పరిశుభ్రత చర్యలు

నేతలు దిగి వచ్చిన వేళ



గిరిజన వృద్ధురాలితో మాట్లాడుతున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత



ఆటో వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో తొలి సారి గెలిచిన ఎమ్మెల్యేలు జనాలతో కలిసిపోతున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి వంచల గుమ్మ గ్రామంలో 85 ఏళ్ల వృద్ధురాలు పింఛన్ తీసుకోవడానికి ఆటోలో పంచాయతీ కార్యాలయం వచ్చారు. ఇది తెలిసి బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఆమె ఆటో వద్దకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెకి రూ.3000 పింఛన్ అందజేశారు. కాంగ్రెస్‌కు చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మపూర్ ఎమ్మెల్యే బందుగాం సమితిలో మారుమూల గ్రామాల్లో గిరిజనుల ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసు కుంటున్నారు.

20న ప్రెస్ యూనియన్ వార్షికోత్సవం



కలెక్టర్ పట్వారికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న యూనియన్ సభ్యులు

రాయగడ: ఈ నెల 20వ తేదీన ప్రెస్ యూనియన్ తొమ్మిదో వార్షికోత్సవం జరగనుంది. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమానికి కదాంబిని మాస పత్రిక సంపాదకురాలు డాక్టర్ ఇతిరాణి సామంత ముఖ్యఅతిథిగా, కొరాపుట్ విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిఖిల్ కుమార్ గౌడ ముఖ్యవక్తగా, గౌరవఅతిథిగా అఖిల భారతీయ సాంత సమితి అధ్యక్షులు దండి స్వామి భాస్కర తీర్థలు హాజరుకానున్నట్లు యూనియన్ అధ్యక్షులు అమూల్య రత్న సాహు ,కార్యదర్శి శివాజీ దాస్‌లు మంగళవారం తెలిపారు. వార్షికోత్సవంలో పాల్గొనాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

భూముల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టరేట్‌కు వచ్చిన భంజిరి గ్రామస్తులు

పర్లాకిమిడి: గుసాని సమితి తులసిపాడు గ్రామానికి పరశురాం మౌజా డాక్టర్ భంజిరి గ్రామంలో పదేళ్లగా నివాసం ఉంటున్నారు. గిరిజనులు, పేదలు ఇళ్లను ఖాళీ చేయించి సుమారు 55 ఎకరాల భూములను కబ్జా చేశారంటూ జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌కు గుసాని జెడ్పీటీసీ సభ్యుడు యస్.బాలరాజు, భంజిరి గ్రామస్థులు మంగళవారం ఫిర్యాదు చేశారు. డాక్టర్ భంజిరి భూములు పూర్వకాలం నుంచి మోటూరు వారి పేరుమీద ఉన్నాయి. అయితే అ భూములు రియల్ ఎస్టేట్స్, దళారులు ఏకంగా అమ్ముకోవాలని చూస్తున్నందుకు డాక్టర్ భంజిరి గ్రామస్తులు కలెక్టరేట్‌కు వచ్చి అధికారులను కలిశారు.

దీనిపై జిల్లా రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రార్ అధికారులు తగు చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి దృష్టికి తీసుకువెళతామని గుసాని జెడ్పీటీసీ సభ్యుడు యస్.బాలరాజు విలేకరులతో అన్నారు.

డ్రైవర్ల సమస్యలపై ఎస్పీకి వినతి



ఎస్పీ స్వాతికి వినతిపత్రం సమర్పిస్తున్న డ్రైవర్లు

రాయగడ: విధి నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వివిధ వాహనాల డ్రైవర్లు కోరారు. ఈ మేరకు ఎస్పీ స్వాతి ఎస్ కుమార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఒడిశా డ్రైవర్ల మహాసంఘం రాయగడ శాఖకు చెందిన డ్రైవర్లు ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఒడిశా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవరు అండ్ వర్కర్స్ సంక్షేమ బోర్డులో డ్రైవర్‌ను సభ్యునిగా చేర్పించాలన్నారు. అలాగే డ్రైవర్లపై జరుగుతున్న దాడులపై జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించి తగు రక్షణ కల్పించాలని వివరించారు. డ్రైవరుగా విధులు నిర్వహించి 60 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. పార్కింగ్ చేసేందుకు నిర్దిష్టమైన స్థలాన్ని పట్టణంలోని ప్రతీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఒడిశా డ్రైవర్ల మహాసంఘం కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ తురక్ నేతృత్వంలో డ్రైవర్లు ఈ మేరకు ఎస్పీకి విన్నవించారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

- రాజ్యసభ మాజీ సభ్యుడు భాస్కరరావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నెక్కంటి, పక్కనే హిమిరిక తదితరులు

రాయగడ: మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడం అందరి కర్తవ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక సంస్కృతి మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరిగిన ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒడిశా సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిళ్లని అన్నారు. మన భావితరాలకు అవి తెలిసేలా ఇటువంటి కార్యక్రమాలను మహిళా సంఘాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రోజో సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్యఅతిథి నెక్కంటి బహుమతులను అందజేశారు. సంస్కృతి మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత పాలో, కార్యదర్శి సరస్వతి సాహు, కోశాధికారి సర్మిష్ట పాఢిల నేతృత్వంలో కార్యక్రమం జరిగింది.

అత్యాచార నిందితుడు అరెస్టు



అరెస్టైన నిందితుడు రాజ కందపాన్

జయపురం: బాలికను అపహరించి అత్యాచారం చేసిన నేరంపై ఒక వ్యక్తిని జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కక్కిరిగుమ్మ పంచాయతీ తునాపొదర్ గ్రామానికి చెందిన రాజ కందపాన్ ఉరఫ్ టుకులు, ఉరఫ్ ముకుంద అని పేర్కొన్నారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని బెయిలు మంజూరవ్వకపోవడంతో జైలుకు తరలించామన్నారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురానికి చెందిన ఒక మైనర్ బాలిక 2024లో ఒక వివాహ విందుకు వెళ్లింది. అక్కడ ఆమెకు రాజ కంద పాల్ పరిచయమయ్యాడు. అప్పటినుంచి వారిరువురు ఫోనులో మాట్లాడుకోవటం ప్రారంభమయింది. అయితే ఈ ఏడాది మార్చి రెండో వారంలో రాజకందపాన్ ఆ బాలికను అపహరించి తీసుకెళ్లిపోయాడు. మైనర్ బాలికను అతడు కేరళ తీసుకెళ్లాడు. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు గత ఏప్రిల్ 3వ తేదీన మైనర్ బాలికను కనుగొని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అప్పుడు పరారైన వ్యక్తిని ఎట్టకేలకు అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ధనుంజయ్ పట్నాయక్ తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్నటువంటి వేంకటేశ్వర స్వామివారి దేవాలయం 16వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం వేంకటేశ్వరుడికి జిల్లాలో ఒకే ఒక్క దేవాలయం ఉంది. దీనిలో భాగంగా దేవాలయం నుంచి పుర వీధుల వెంబడి పల్లకి సేవ జరిగింది. అలాగే సాయంత్రం కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 4 వేల మందికి ఉచిత అన్న ప్రసాద సేవనం జరిగింది. మున్సిపల్ చైర్మన్ కును నాయక్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కె.ధనుంజయ్ పట్నాయక్, సభ్యులు ఎన్.రవిరెడ్డి, టి.నందికేశ్వరరావు, పసుమర్తి ఆనందరావు, జి.చంద్రశేఖర్, నాగేశ్వర్ షావుకారు పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి గుణుపూర్ సమస్యలు



మంత్రి హరిచందన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో నెలకున్న వివిధ సమస్యలను గుణుపూర్ నవనిర్మాణ సమితికి చెందిన బృందం ఇద్దరు రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు సోమవారం బృందం సభ్యులు రాజధానికి వెళ్లి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారిలను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. గుణుపూర్‌లో కొత్తగా నిర్మితమవుతున్న జగన్నాథుని మందిరం ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు సగంలో నిలిచిపోవడంతో.. దేవతా మూర్తులను సగం నిర్మాణంలో గల మందిరంలోనే ఉంచి పూజా కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని మంత్రి హరిచందన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇదిలా ఉండగా రథాయాత్ర సమయంలో భక్తుల ద్వారా వచ్చిన విరాళాలు మందిరాభివృద్ధికి వినియోగించలేకపోతున్నామని.. సరాసరి ఆదాయం దేవదాయ శాఖ ఖాతాలో డిపాజిట్ చేయాల్సి వస్తుందని వివరించారు. సమస్యలు విన్న మంత్రి స్పందించి త్వరలో మందిరం నిర్మాణం పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు దేవదాయ శాఖ కమిషనర్‌తో ప్రత్యేకంగా చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారిని కలిసిన బృందం గుణుపూర్‌లో బైపాస్ రోడ్డు నిర్మాణం గురించి ప్రస్తావించింది. గుణుపూర్ నవనిర్మాణ సమితి అధ్యక్షులు అటయ దాస్, కార్యదర్శి రంజిత పాడి, న్యాయవాది లాడి గొపన్న, జగన్నాథ మందిరం అభివృద్ధి కమిటీ సభ్యులు తిరుపతి మహంతిలు మంత్రులకు కలిసిన వారిలో ఉన్నారు.

ముఖహూర్ పర్వతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

- కలెక్టర్ బిజయకుమార్ దాస్‌కు ఆరు పంచాయతీల ప్రజల విజ్ఞప్తి



ముఖహూర్ పర్వతం వద్ద మహావిష్ణువు విగ్రహం



ముఖహూర్ పర్వతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రచారం చేస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: మోహనా బ్లాక్ మలాస్‌పదర్ గ్రామ పంచాయతీలోని ముఖహూర్ పర్వతం వద్ద శ్రీమహావిష్ణువు విగ్రహం బయటపడింది. ఈ ముఖహూర్ పర్వతం వద్ద ఆంజనేయస్వామి, దుర్గా, శివలింగాలకు అక్కడి ప్రజలు చాలా కాలం నుంచి పూజలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి అభివృద్ధి చేయాలని ఇక్కడి గిరిజనులు కోరుతున్నారు. తద్వారా తమకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆరు పంచాయతీల ప్రజలు కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌ను మంగళవారం కలిసి వినతిని అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే మోహనా బీడీవో రాజీవ్ దాస్‌ను ఆ ప్రాంతం విశేషాలు, రోడ్డు నిర్మాణానికి దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఖలియాగుడ మాజీ జిల్లా పరిషత్ సభ్యులు రాజీవ్ మల్లిక్, హరిశ్చంద్ర మల్లిక్, పర్యాటక ప్రచారకుడు సుజ్ఞాన్ సాగర్, గురుదేవ్ మల్లిక్, ఖల్లిగుడ నుంచి కలియా మల్లిక్, హోరుగుడ నుంచి సంతోష్ మల్లిక్‌లు ఉన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆరు పంచాయతీల ప్రజలు

శ్రీ జగన్నాథునికి లేహ్యా సేవ



శ్రీ మందిరానికి ఒస్సా తరలించిన సుధ సువారొ సేవక వర్గం

భువనేశ్వర్ : స్నాన పూర్ణిమ నాడు భారీ స్నానం చేసిన తర్వాత శ్రీ జగన్నాథుడు, అతని తోబుట్టువులు అస్వస్థతకు గురయ్యారు. వారు త్వరగా కోలుకోవడానికి ఆలయ రాజ ఆయుర్వేద వైద్యుల మార్గదర్శకత్వంలో వివిధ రకాల మూలికా ఔషధాలతో చికిత్స కొనసాగిస్తున్నారు. దేవతలు ప్రస్తుతం అనవసర మండపంపై కొలువు దీరి గోప్య సేవలు పొందుతున్నారు. ఈ సేవల్లో ప్రత్యేకంగా తయారుచేసిన నూనెలు, మూలికా ఔషధాలు వాడతారు. ఈ సమయంలో స్థానిక మూలికలు మరియు వేర్లతో తయారు చేసిన ఔషధాలు, పండ్ల రసాలు మూల విరాట్లకు సమర్పిస్తున్నారు. ఈ క్రమంలో మంగళ వారం ఒస్సా లగ్గి (తైల పూత) ఉపచారంతో సేవలు అందించారు. సుధ సువారో సేవక వర్గం తయారు చేసిన ఒస్సా అనే ప్రత్యేక వైద్యాన్ని దేవతలకు అందజేశారు. మంగళ వారం అపరాహ్న ధూపం తర్వాత దేవతలకు ఒస్సా లగ్గి నిర్వహణ సన్నాహాలు ప్రారంభించారు. దైతపతి సేవకులు రాత్రి పూట ఈ చికిత్స నిర్వహించారు.

ఘనంగా రొజ్జొ ఉత్సవం



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మనోరంజన్ ప్రధాన్



కార్యక్రమ వేదికపై ఆశీనులైన అతిథులు

జయపురం: రొజ్జొ పండగ సృష్టి, వ్యవసాయ సంబంధిత పండుగ అని విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మనోరంజన్ ప్రధాన్ అన్నారు. ఉత్కళుల ప్రధాన పండగల్లో ఒకటైన రొజ్జొ పర్వ్‌ను జయపురంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ సురేష్ దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రధాన్ రొజ సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. దేవేంద్ర బాహిణీపతి, పాత్రికేయుడు రాజేంద్ర కుమార్ గౌఢ, డాక్టర్ రాజేంద్ర పాఢి, జయపురం పర్వ్ కమిటీ అధ్యక్షుడు ఇంజినీర్ మణిగాంధీ తమ అభిప్రాయాలు వెల్లడించారు.

క్లుప్తంగా

పైడితల్లికి చండీయాగం



ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి వేదపండితులు మంగళవారం చదురుగుడి ఆవరణలో శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. దూసి శివప్రసాద్ అమ్మవారికి యాగం చేసి, యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. సుమారు 40 మంది దంపతులు యాగంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తరించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

• నిందితుడిపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలస ప్రాంతంలో గల నాయుడువీధికి చెందిన రవితేజ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన యువతిని నమ్మించి మోసం చేయడంతో పట్టణ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ కె.మురళీధర్ తెలిపిన వివరాల మేరకు బాధిత యువతి, నిందితుడు రవితేజ ఇద్దరు విశాఖలోని ఓ రియల్‌ఎస్టేట్ కార్యాలయంలో పనిచేసేవారు. ఒకే ప్రాంతానికి, ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వాడుకుని పెళ్లి విషయం వచ్చేసరికి కాదని చెప్పడంతో మోసపోయానని గుర్తించిన యువతి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బట్టల షాపులో అగ్నిప్రమాదం



రెడీమేడ్ దుకాణంలో దగ్ధమైన మెటీరియల్స్

చీపురుపల్లి: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల రాధామాధవ ప్లాజాలో ఓ రెడీమేడ్ వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు రూ.25 లక్షల ఆస్తినష్టం జరిగిందని దుకాణం యజమాని చెబుతున్నాడు. మంగళవారం తెల్లవారు జామున 4గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ఈ దుర్ఘటనపై బాధితుడు కలివరపు జగదీష్ మాట్లాడుతూ సోమవారం రాత్రి ఎంతో విలువైన మెటీరియల్ తీసుకువచ్చి దుకాణంలో పెట్టామని, మొత్తం కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

క్వారీ లారీ బోల్తా



వావిలపాడు సమీపంలో బోల్తాపడిన లారీ

వేపాడ: మండలంలోని వావిలపాడు క్వారీ నుంచి విశాఖ వెళ్తున్న లారీ బోల్తా పడింది. వావిలపాడు నుంచి విశాఖ వైపు పెద్దపెద్ద బండరాళ్లను తీసుకెళ్తున్న లారీ ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. క్రేన్, జేసీబీల సహాయంతో లారీని తీసేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి బబిత

విజయనగరం లీగల్: స్థానిక కోర్టు సముదాయంలో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎం.బబిత తెలిపారు. ఇదే విషయమై ఆమె జిల్లా కేంద్రంలో బ్యాంకులు, చిట్‌ఫండ్ కంపెనీల మేనేజర్లు, అధికారులతో మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. వారి పరిధిలోని కేసులు రాజీ అయ్యేలా చూడాలని వారిని కోరారు. ప్రతి లోక్ అదాలత్‌లో పెద్దఎత్తున కేసుల పరిష్కారం జరుగుతోందని, ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సంస్థ, కార్యదర్శి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹97	₹164	₹174

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

• కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రతి మహిళా లక్షాధికారి కావాలని, ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్త వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మెప్మా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వివిధ రకాల జీవనోపాధుల ద్వారా డబ్బులు సంపాదించే మార్గాలు అనేకం ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో ఏపీఎంలు, సీఓలు, ఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలకు జీవనోపాధి కల్పించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా చేస్తున్న కృషిని కలెక్టర్ ముందుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మెప్మా అధ్వర్యంలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులతో కొత్త వ్యాపార యూనిట్లను స్థాపించి, వారిని లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళలు లాభాలు ఆర్జించేలా యూనిట్ల స్థాపన ఉండాలన్నారు. అలాగే యూనిట్ల ఏర్పాటుకు అవసరమైతే శిక్షణ ఇప్పించాలని సూచించారు. కొత్త ఆలోచనలతో వ్యాపారాలను విస్తరించవచ్చని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని పేర్కొన్నారు. సరుకుల కొనుగోలు, విక్రయాల్లో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో విక్రయించడం ద్వారా, డోర్ డెలివరీ వంటి సదుపాయాలను కల్పించడం ద్వారా వ్యాపారాలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే మహిళా మార్టులు, మొబైల్ మార్టులు, కాఫీ షాపులు వంటి కొత్త ఆలోచనల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. ఇప్పటికే వస్త్ర వ్యాపారాలు, తినుబండారాలు, ఫ్యాన్సీ షాపుల ద్వారా మహిళలు లాభాలను ఆర్జిస్తున్నారని, అయినప్పటికీ వాటికి భిన్నంగా అందరికీ అవసరమయ్యే వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

సూర్యఘర్ ఏర్పాటుకు సబ్సిడీ

అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై సమీక్షించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సూర్యఘర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సూర్యఘర్ యూనిట్ ఏర్పాటుతో 28 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ పొందవచ్చని, ఇందుకు అవసరమైన రుణాలను బ్యాంకు మంజూరు చేయడమే కాకుండా దాదాపు 50 శాతం వరకు సబ్సిడీ కూడా ప్రభుత్వం నుంచి లభిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ముందుగా సొంత ఇల్లు కలిగిన మెప్మా ఉద్యోగులు, సిబ్బంది సూర్యఘర్ యూనిట్లను ఏర్పాటుచేసుకుని, మిగిలిన సభ్యులకు అవగాహన కల్పించి, వారు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే మాసానికి ప్రతి ఉద్యోగి కనీసం 100 యూనిట్లు గ్రౌండింగ్ చేయించాలని, బ్యాంకుల నుంచి సమస్యలు ఉంటే వాటిని తన దష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మెప్మా పథక సంచాలకుడు జీవీ చిట్టిరాజు, ఏపీఎంలు, సీఓలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

• బొలెరో వాహనం కిందికి బైక్‌తో భార్యాభర్తలు



బొలెరో కింద ఇరుక్కున్న ద్విచక్రవాహనం



ఘటనాస్థలంలో బాధితులకు సపర్యలు చేస్తున్న స్థానికులు

పాలకొండ రూరల్: మండలంలోని పణుకువలస కూడలిలో గల మలుపు వద్ద మంగళవారం రెప్పపాటులో పెనుప్రమాదం నుంచి భార్యాభర్తలు బయటపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండలంలోని మొట్ట గ్రామానికి చెందిన లచ్చుభుక్త దుర్గారావు, భార్య రమ్యతో కలిసి ద్విచక్రవాహనంపై పాలకొండ వచ్చారు. వారి గ్రామంలో అమ్మవారి పండగలు, పాఠశాలలు ప్రారంభం కావడంతో అవసరమైన సరుకులు, పిల్లల కోసం పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేసుకుని తమ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. పణుకువలస మలుపు వద్దకు చేరుకునే క్రమంలో వీరఘట్టం నుంచి పాలకొండ వైపు వస్తున్న బొలెరో వాహనం వారి బైక్‌ను ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న భార్యాభర్తలు తమ వాహనంతో సహా ఎదుటి వాహనం కింద ఇరుక్కుపోయారు. బొలెరో కొంత దూరం వెళ్లడంతో ఇద్దరూ మరణించి ఉంటారని స్థానికులు భావించారు. విషయం గమనించిన బొలెరోను డ్రైవర్ నిలుపుదల చేయడంతో రెప్పపాటులో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో భర్త దుర్గారావుకు కాలు నుజ్జవగా, భార్య రమ్య తీవ్ర గాయాలతో బయటపడ్డారు. అక్కడి వారు అందించిన సమాచారంతో 108 వాహనం ఘటనాస్థలానికి చేరుకుని హుటాహుటిన క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించింది. ప్రాథమిక సేవలు అందించిన వైద్యులు మెరుగైన సేవల కోసం రమ్యను రాజాంకు, దుర్గారావును విశాఖపట్నం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రమాద సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఆస్పత్రి వర్గాలు తెలియజేశాయి.

జిల్లాలో యోగా ప్రదర్శనకు 5555 వేదికలు

• విశాఖకు 30 వేల మంది తరలింపు
• కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్

విజయనగరం అర్బన్: ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 5,555 వేదికల్లో యోగా ప్రదర్శన జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ ప్రదర్శనలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆరోజు విశాఖ జిల్లాలో జరిగే ప్రధానమంత్రి కార్యక్రమానికి జిల్లా నుంచి సుమారు 30 వేల మందిని పంపించనున్నట్లు తెలిపారు. యోగా దినోత్సవ నిర్వహణ, తరలింపుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను యోగా కార్యక్రమానికి రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా నుంచి సుమారు 8.8 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారని వారందరి చేత 21న యోగా ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా నుంచి 30 వేల మందిని విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి పంపించనున్నామని ఇందు కోసం 650 బస్సులను వినియోగిస్తున్నామని చెప్పారు. వారిని తరలించే బాధ్యత ఎంపిడీఓలదేనని స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా నుంచి వచ్చే వారికోసం భీమిలి బీచ్‌లో 68-97 కంపార్ట్‌మెంట్లు కేటాయించారన్నారు. ఈ 30 వేల మందిలో 15 వేల మంది విద్యార్థులు కాగా మిగిలిన వారు సాధారణ పౌరులని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులను మాత్రమే ఈ కార్యక్రమానికి పంపించాలన్నారు.

ప్రతి బస్సుకు లైజనింగ్ అధికారి


విద్యార్థులు, ప్రజల తరలింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముందుగానే బస్సులను పంపిస్తామని ప్రతి బస్సుకు ఒక లైజనింగ్ అధికారిని ఏర్పాటు చేశామన్నారు. విశాఖకు దగ్గర ప్రాంతాల నుంచి ఉదయం 4 గంటలకు, దూర ప్రాంతాల నుంచి 3 గంటలకే బస్సులు బయలు దేరాలని స్పష్టం చేశారు. ఇప్పటికే రూట్‌మ్యాప్‌ల ఖరారు జరిగిందని ఆయా రూట్లలో మరుగుదొడ్లు ఉన్న హోటళ్ల దాబాలు, పాఠశాలలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని బస్సులకు ట్యాగ్ చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల లేదా హోటల్ వద్ద ఒక పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జ్‌గా ఉంచాలని చెప్పారు. అక్కడి మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు సిబ్బందిని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులంతా 20వ తేదీ రాత్రి మండలాల్లోనే ఉండి తరలింపు ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, డీఈఓ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, జీఎస్‌డబ్ల్యూ నోడల్ అధికారిణి రోజారాణి, డీపీఓ టి.వెంకటేశ్వరరావు, డీటీఓ కుమారస్వామి, మండలాల నుంచి ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు జన సమీకరణ

• వేలల్లో తరలింపునకు సన్నాహాలు • శాఖల వారీగా లక్ష్యం • ప్రత్యేకంగా బస్సులు • తలలు పట్టుకుంటున్న అధికారులు



యోగాంధ్రలో విద్యార్థులు



ఒంటికి యోగా మంచిదేగా... ఇది కాదనలేని నిజం. అయితే దీన్ని ఎవరి వ్యక్తిగతంగా వారు ఆలోచించి చేసుకోవాల్సిన ఒక జీవన యానం. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగమైతే ఆరోగ్యవంతంగా ఉంటారన్న వాస్తవం ఎవరు కాదనరు. కానీ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ విశాఖ రానుండడంతో దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఫోకస్ పెట్టి ఆయన దృష్టిలో పడి మార్కులు కొట్టేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా యోగా దినోత్సవం పేరిట నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఒక కార్యక్రమం ప్రతి చోట చేయాలని నిర్దేశించారు. మురికివాడల నుంచి జిల్లా ఉన్నత కార్యాలయాల వరకు రోజూ ఏదో ఒక కార్యక్రమం చేపట్టేలా ప్రణాళిక రచించి అమలు చేస్తున్నారు. అయితే ఇదంతా బలవంతపు కార్యక్రమం కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదీ కేవలం ఫొటోలకే పరిమితం కావడం చర్చనీయాంశమైంది.

సాక్షి, పార్వతీపురం మన్యం : ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో జరగనున్న యోగాంధ్ర వేడుకల నిమిత్తం జన సమీకరణకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానుండటం.. దాదాపు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడంతో ఆ మేరకు ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా ప్రజలను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆర్టీసీ, ప్రైవేట్ సర్వీసులను వినియోగిస్తున్నారు. విద్యార్థులతో పాటు.. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇప్పటికే యోగా మాసోత్సవాల పేరిట కొద్ది రోజులుగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. జిల్లాకు రూ.50 లక్షల వరకు ఇందు కోసం ఖర్చు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా లక్ష్యం 60 వేల పైమాటే..

21వ తేదీన విశాఖలో జరిగే ప్రధాని కార్యక్రమానికి ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి కనీసం ప్రజలు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో కలిపి 60 వేల మందికి తక్కువ కాకుండా తరలించాలని అధికారులకు లక్ష్యం విధించారు. ఇందులో విజయనగరం జిల్లాలో విద్యార్థులు 15 వేల మంది, సాధారణ పౌరులు కనీసం మరో 15 వేల మంది ఉండాలని స్పష్టం చేశారు. వీరు కాక.. పోలీసు బలగాలు, రెవెన్యూ, ఇతర శాఖల నుంచీ ఉద్యోగులను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. ఇందుకోసం 660 బస్సులను వినియోగిస్తున్నారు. విద్యార్థులు, ప్రజల తరలింపునకు ప్రతి బస్సుకూ ఒక లైజనింగ్ అధికారిని ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారులంతా ఈ నెల 20వ తేదీన రాత్రి మండలాల్లోనే ఉండి.. అందరినీ తరలించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 28 వేల మంది విద్యార్థులను తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. వీరుకాక.. సాధారణ పౌరులు, వివిధ శాఖల నుంచి కనీసం మరో 10 వేల మందినైనా తరలించాలని చూస్తున్నారు. ఉపాధి వేతనదారులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ సిబ్బందినీ తరలించే యోచనలో ఉన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆర్టీసీ, ప్రైవేట్ సర్వీసులు కలిపి మొత్తం 850 వాహనాలను జనాల తరలింపునకు సిద్ధం చేస్తున్నారు.

తలలు పట్టుకుంటున్న అధికారులు

ఇప్పటికే నెల రోజుల ఉత్సవంలో ప్రతి రోజూ ఏదో చోట కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. వీటికి జనాలను, విద్యార్థులను తీసుకొచ్చి కూర్చోబెట్టడం అధికారులకు తలకు మించిన భారమవుతోంది. చివరికి ఉపాధి వేతనదారులనూ వదలడం లేదు. పనులు చేసిన చోటే వారిని నిల్చోబెట్టి, ఫొటోలు తీసి కార్యక్రమాన్ని మమ అనిపించేస్తున్నారు. ఇప్పుడు యోగా దినోత్సవం రోజున వేలల్లో తరలించాల్సి రావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా ఉపాధి వేతనదారులు, సంఘాల మహిళలపైనే పడ్డారు. ఆ రోజు కార్యక్రమానికి రాలేని వారికి ఉపాధి పనులు కల్పించబోమని హెచ్చరిస్తున్నారు. 8వ తరగతి దాటిన విద్యార్థులందరినీ తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకూ ఆదేశాలిచ్చారు. యోగాసనాల కోసం తమను ఎందుకు ఇబ్బంది పెడతారని వివిధ వర్గాల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ప్రధాని రానుండడంతో ఆయన వద్ద మెప్పు పొందేందుకే చంద్రబాబు ఇలా అన్ని వర్గాల వారిని ఇబ్బందులు పాల్జేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫొటో పోజులకే యోగాంధ్ర పరిమితమైందన్న వాస్తవాన్ని ఏ ఒక్కరూ కాదనలేరని సర్వత్రా వాదన వినిపిస్తోంది.

కొఠియా గ్రామాల్లో కొరాపుట్ కలెక్టర్ పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న కొరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్

సాలూరు: వివాదాస్పద ఆంధ్రా, ఒడిశా సరిహద్దు కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశాలోని కొరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్ పర్యటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కొఠియా, దొర్లతాడివలస, నేరెళ్లవలస, ధూళిభద్ర, ఎగువశెంబి, డోలియాంబ గ్రామాల్లో పర్యటించి ఆయాగ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒడిశా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ గ్రామాల్లో అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఒడిశా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ నెల 27న కొఠియా, నేరెళ్లవలసల్లో జరగనున్న జగన్నాథ స్వామి రథయాత్ర ఏర్పాట్లు, అభివృద్ధి పనులను కలెక్టర్ కీర్తి వాసన్ పర్యవేక్షించారు.

రెండు బస్సులు ఢీకొని ఐదుగురికి గాయాలు



విద్యార్థులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనగా ఐదుగురు గాయపడినట్లు ఎస్సై ఎ.సన్యాసి నాయుడు తెలిపారు. విజయనరం-నాతవలస ఆర్ అండ్‌బీ రహదారిపై డెంకాడలో ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు డెంకాడ నుంచి విజయనగరం వైపు వస్తుండగా, విజయనగరం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు డెంకాడ గ్రామంలో ఎదురెదురుగా ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలైనట్లు చెప్పారు. ఈ ప్రమాదం సందర్భంగా ప్రైవేట్ పాఠశాల బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారని స్థానికులు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో పాటు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి ఓదార్చారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సారా స్థావరాలపై దాడి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూరింటెండెంట్ శ్రీనాథుడు ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన కెరడ, సుళువ, వలవ గ్రామాల పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సుమారు 3500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. దాడుల్లో జిల్లా ఏఈఎస్‌పీ జీవన్ కుమార్, కిశోర్, డీటీఎఫ్ సీఐ వీవీఎస్ శేఖర్ బాబు, సాలూరు, బొబ్బిలి, కురుపాం, రాయగడ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



సరిహద్దులో దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

6 మద్యం సీసాల పట్టివేత

గుర్ల: మండలంలోని సదానందపురంలో బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నెల్లిమర్ల ఎక్సైజ్ ఎస్సై ఎం. వెంకటరావు మంగళవారం తెలిపారు. మద్యం అమ్ముతున్న వ్యక్తి నుంచి ఆరు మద్యం సీసాలు పట్టుకుని సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడి


• మద్యం మత్తులో ఆకతాయిల వీరంగం
• ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



దాడిలో గాయపడిన శంకరదొర

వంగర: మండల పరిధి కొప్పరవలస సమీపంలో మందుబాబులు వీరంగం సృష్టించారు. ఈ ఘటనపై వంగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..కొప్పరవలస-కొండచాకరాపల్లి ఐటీడీఏ కాలనీ సమీపంలో ఉన్న జీడితోటల వద్ద కొంతమంది యువకులు మంగళవారం మద్యం తాగుతున్నారు. అదే సమయంలో వీరఘట్టం నుంచి స్వగ్రామం ఐటీడీఏ కాలనీకి వెళ్లేందుకు అటువైపుగా బంటుపల్లి శంకరదొర వస్తున్నాడు. ఇంతలో అక్కడ మద్యం తాగుతున్న యువకులు శంకరదొరను కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో శంకరదొర మెడభాగంలో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న ఈఎంటీ ఆలుబిల్లి జగదీష్ బాధితుడికి ప్రథమ చికిత్స అందించి రాజాం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి కారకులైన కొప్పరవలస గ్రామానికి చెందిన కోట్ల గణేష్, కోట్ల అప్పలరాజు, రేగిడి మండలం తోకలవలస గ్రామానికి చెందిన బుడితి రాంబాబులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వై.పైడితల్లి తెలిపారు.

21న జాబ్‌మేళా



గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ ఆర్‌ఐటీఐ వద్ద ఈ నెల 21న హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి ఎలక్ట్రికల్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలోని ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, మెకానిక్ మోటర్ వెహికల్ మరియు కోపా ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు జాబ్‌మేళాకు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో ఆ రోజు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9491134464 నంబరుకు సంప్రదించాలలని ఆయన సూచించారు.

త్వరలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

• జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను త్వరలో చేపట్టనున్నామని, దీనికి రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌వో తన చాంబర్‌లో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించడానికి ఇదే తగిన సమయమని అన్నారు. పాత భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కొత్త భవనాల్లోకి మార్చడానికి అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు, కేంద్రాల్లో మార్పు చేర్పులకు, ఒకచోట నుంచి మరో చోటుకు తరలించడానికి అవకాశం ఉందన్నారు. అదే విధంగా 1200 కంటే ఓటర్లు ఎక్కువగా ఉన్నచోట అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కూడా అవకాశం ఉందన్నారు. ఈ విధంగా జిల్లాలోని రాజాం నియోజకవర్గంలో 17, బొబ్బిలిలో 26, చీపురుపల్లిలో 4, గజపతినగరంలో 3, నెల్లిమర్లలో 17, విజయనరగం 61, ఎస్.కోట నియోజకవర్గంలో 10 మొత్తం 138 పోలింగ్ కేంద్రాల్లో 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, తరలింపులు, కొత్త కేంద్రాల ఏర్పాటుకు ఈ నెల 30వ తేదీలోగా రాజకీయ పార్టీల నుంచి ప్రతిపాదనలను అందజేయాలని కోరారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, ఇతర సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులు వర్రి నర్సింహమూర్తి, శ్రీనివాసరెడ్డి, సతీష్‌కుమార్, సీహెచ్ అప్పారావు, సోములు తదితరులు పాల్గొన్నారు.